క్లుప్తంగా

టీబీఎస్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఫణి మోహన మురళి



నల్లకుంట: తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్ఎస్) రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎల్బీ నగర్ కొత్తపేట్‌కు చెందిన రంగరాజు ఫణి మోహన మురళి నియమితులయ్యారు. శుక్రవారం సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రమణారావు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. సునీల్, జిల్లా సహ కార్యదర్శి అశోక్‌కుమార్, వేణుగోపాల్‌రావు, చంద్రహాస్ రావు, పద్మ తదితరులున్నారు.

నేడు గోదాదేవి కల్యాణోత్సవం వేడుకలు

చిక్కడపల్లి: చిక్కడపల్లిలోని పలు ఆలయాల్లో గోదాదేవి కల్యాణోత్సవం జరుగుతుందని ఆయా ఆలయాల నిర్వాహకులు ప్రకటించారు. శనివారం సాయంత్రం చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయం, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ లక్ష్మీగణపతి దేవాలయంలో శనివారం గోదాదేవి కల్యాణం కన్నుల పండవగా జరుగుతుందని ఆలయ చైర్మన్‌లు మురళీ ప్రసాద్, ముచ్చకుర్తి ప్రభాకర్ ఈఓలు దేవనాథం, లక్ష్మారెడ్డి వివరించారు.

నాట్య ప్రదర్శన



చిక్కడపల్లి: త్యాగరాయగానసభలో వంశీ ఆర్ట్ థియేటర్స్, శుభోదయం గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన భరతనాట్యం ఆకట్టుకుంది. సుజాతా శ్రీనివాసన్ శిష్యరికంలో శిక్షణ పొందిన సీత, నిత్యలు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో వారు మన సంస్కృతిని అనుసరించడం అభినందనీయమన్నారు. రచయిత్రి శారద పూర్ణ శొంఠి, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, వంశీరామరాజు నాట్యగురువులు ఎస్పీ భారతి, ఆలేటి రంగమణి, డాక్టర్ రమాదేవి, వనజా ఉదయ్, సుజాత, వింజమూరిలను అవార్డులతో సత్కరించారు. చిన్నారులు అమెరికాలో పుట్టి పెరిగిన నిత్య, సీతలు మాతృభాష, సంస్కృతి పట్ల ఆసక్తి కనబరచడం విశేషమన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చిక్కడపల్లి: నగరంలోని ప్రముఖ విద్యాసంస్థ ఆల్ సెయింట్స్ హైస్కూల్ 1972 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 65 నుంచి 70 ఏళ్లున్న పూర్వ విద్యార్థులు తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు కైలాష్‌చరణ్, అమరేంద్రరెడ్డి, జ్ఞానేశ్వర్ రెడ్డి, తేజ్‌బాబు, నరేంద్రసిల్వా, సతీశ్‌అగర్వల్, ఆనంద్‌కుమార్‌మూర్తి, రాజ్‌కుమార్, అఖిల్, బీఎస్ మోహన్ తదితరులున్నారు.

ప్రత్యేక పూజలు



కవాడిగూడ: భోలక్‌పూర్ డివిజన్‌లోని మల్లికార్జునస్వామి దేవాలయంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మల్లన్నకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ జ్యోతి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్‌లు అంజిరెడ్డి, ఊర్మిలాఅంజిరెడ్డి ఆధ్వర్యంలో ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. పూజారి మధుసూదనాచారి, భవాని శంకర్ దేవాలయ సీనియర్ అసిస్టెంట్ సురేష్‌కుమార్ తదితరులున్నారు.

జానపద గీతాల ప్రదర్శన



చిక్కడపల్లి: సమాజాన్ని పాట ఎంతో ప్రభావితం చేస్తుందని ఎస్ఎస్ఎస్ రాష్ట్ర కన్వీనర్ ఉదయశ్రీ అన్నారు. 'నల్లోల్ల పిల్లగాడు' జానపద గీతం చిత్ర ప్రదర్శన కార్యక్రమం శుక్రవారం త్యాగరాయగానసభ గుండవరపు హనుమంతరావు కళావేదికలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. ప్రధానంగా జానపదగీతాలు తెలంగాణ జీవితంలో భాగంగా మారిపోయారన్నారు. యూట్యూబ్‌లలో వేస్తున్న అనేక జానపద పాటలను చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంటుందన్నారు. తెలంగాణ యాస, భాష మాధుర్యాన్ని జానపద గీతాల్లో చక్కగా ప్రదర్శిస్తారన్నారు. నటి చందన, డైరెక్టర్ ధీరజ్ , సంగీత దర్శకులు దండేపల్లి శ్రీను, మేడి వరప్రసాద్, సతీష్, బిటు, వంశీ తదితరులున్నారు.

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి



పోలీసు కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థులతో ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: గత 31 రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న పోలీసు కానిస్టేబుళ్ల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యానగర్‌లోని బీసీ భవన్ నుంచి వందలాది మంది పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థులు ప్రగతిభవన్ ముట్టడికి బయల్దేరి వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కొద్దిసేపు బీసీ భవన్‌వద్ద ఉద్రిక్త వాతావరణ చోటు చేసుకుంది.

- పోలీసులతో నిరుద్యోగ అభ్యర్థుల తోపులాట, వాగ్వివాదంతో ఆ ప్రాంతం అంతా ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తింది. అనంతరం ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడాలేని విధంగా దేహదారుఢ్య పరీక్షలలో ఒకటైన లాంగ్ జంప్‌కు 3.8 మీటర్ల నుంచి 4 మీటర్లకు పెంచారన్నారు.
- గతంలో నోటిఫికేషన్ ఇచ్చిన సమయంలో 5 రకాల ఈవెంట్స్‌లలో ఏదేని మూడు ఈవెంట్స్ క్వాలిఫై అయిన వారికి సివిల్, కమ్యూనికేషన్, ఎక్సైజ్, ఫైర్, జైలు వార్డెన్ లాంటి వివిధ రకాల పోస్టులకు మెయిన్స్ ఎగ్జామ్ రాయడానికి అవకాశాన్ని కల్పించేవారని దానికి భిన్నంగా ఈ నోటిఫికేషన్‌లో మూడు ఈవెంట్స్ మాత్రమే పెట్టి ఆ మూడు ఈవెంట్స్ క్వాలిఫై అయితేనే మెయిన్స్ రాయడానికి అవకాశం కల్పిస్తున్నారని విమర్శించారు.
- దీని కారణంగా ఏ ఒక్క ఈవెంట్‌లో క్వాలిఫై కాకపోయినా నాలుగురకాల ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులకు అభ్యర్థులు అర్హత కోల్పోతున్నారన్నారు.
- గతంలో జరిగిన సెలక్షన్ విధానాన్ని యథాతథంగా అమలు చేయాలని లాంగ్ జంప్‌ను 3.8 మీటర్లకు తగ్గించాలని ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, నీలం వెంకటేష్, పగిడాల సుధాకర్, వేముల రామకృష్ణ, అంజి, అనంతయ్య, రాజేందర్, రాజ్‌కుమార్, అశోక్, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మానవతాదృక్పథానికి వివేకానందుడు ప్రతీక



మాట్లాడుతున్న అచార్య కొలకలూరి ఇనాక్

చిక్కడపల్లి: మానవతాదృక్పథానికి ప్రతీక స్వామి వివేకానందుడని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. శుక్రవారం త్యాగరాయ గానసభ కళాలలిత కళావేదికలో స్వామి వివేకానందుని జయంతి సభ 'తెలుగు భాషా చైతన్యసమితి' 'అక్షరకౌముది సేవాసంస్థ' పాలడుగు నాగయ్య కళాపీఠం, లక్ష్యసాధన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. తాత్విక, దార్శనిక, ఆధ్యాత్మిక దృశ్య వికాసానికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు.

- డిగ్రీ విద్యను 10 ఏళ్లలోనే పూర్తి చేశారని రామకృష్ణమతం, రామకృష్ణ, మిషన్‌లను స్థాపించారని పేర్కొన్నారు. రామకృష్ణ మిషన్ ద్వారా దేశ విదేశాల్లో ప్రాచీన తత్వాన్ని పెంచేలా స్వామి వివేకానందుడు ఎంతో కృషి చేశారన్నారు. ఆయనకు ఎంతో గొప్ప జ్ఞాపకశక్తి ఉందని వందల శ్లోకాలు అలవోకగా చెప్పేవారని ఈ సందర్భంగా గుర్తుచేశారు.
- చికాగో పార్లమెంట్‌లో ఆయన చేసిన డియర్ సిస్టర్స్, బ్రదర్స్, అనే ప్రసంగం మొదటి మాటాలకు ఆ హాల్‌లోని ఏడు వేల మంది నిలబడి రెండు నిముషాలపాటు ఆగకుండా చప్పట్లు కొట్టారన్నారు. నిర్వాహకులు బడేసాబ్, కళాజనార్దనమూర్తి, వెంకటరమాచార్యులు, రామకృష్ణచంద్రమౌళి, గంటా మనోహర్‌రెడ్డి, బైలూరు యోగేష్‌ప్రభు, పాలడుగు సరోజనీదేవి, కొండామోహన్, మల్లెపూల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో యువకుడి మృతి

చిక్కడపల్లి: లోయర్ ట్యాంక్‌బండ్ నుంచి వీఎస్టీ వద్దకు నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో ఓ యువకుడి ప్రాణాన్ని బలితీసుకుంది. స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పని ముగించుకున్న యువకుడు క్రేన్ వెనుక టైర్ కిందపడి అక్కడిక్కడే మృతి చెందాడు ఈ ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి శుక్రవారం తెల్లవారు జామున జరిగింది. సీఐ సంజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. లోయర్ ట్యాంక్ బండ్ నుంచి వీఎస్టీ వరకు జరుగుతున్న స్టీల్ బ్రిడ్జి నిర్మాణం పనులకు బీహార్, ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి పని వారిని తీసుకువచ్చారు. ఈ క్రమంలోనే ఉత్తరప్రదేశ్ నుంచి రాజేశ్‌కుమార్(26), అనే యువకుడు 20 రోజుల క్రితం క్రేన్ హెల్పర్‌గా వచ్చి పనిలో చేరాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం ఆరున్నర వరకు పని చేసిన రాజేశ్‌కుమార్ తమకు కేటాయించిన క్యాంప్ వద్దకు వెళ్లాడు. అశోక్‌నగర్ తాడి కొంపాడ్ వద్ద ఉన్న క్రేన్ (టీఎస్09ఎఫ్‌డబ్ల్యూ0181)ను ఎక్కబోయాడు. క్రేన్ డ్రైవర్ నరేంద్రకుమార్ చూసుకోకుండా క్రేన్‌ను పక్కకు తిప్పడంతో రాజేశ్ అదుపు తప్పి క్రేన్‌పై నుంచి పడి వెనుక టైర్ కింద పడ్డాడు దీంతో నడుముకు పెద్దఎత్తున గాయమైన రాజేష్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించాలని అంబులెన్స్‌కు ఫోన్ చేయగా.. సిబ్బంది వచ్చే లోపే అతడు మృతిచెందాడు. క్రేన్ డ్రైవర్ నరేంద్రకుమార్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాంప్రదాయాలకు ముగ్గుల పోటీలు దోహదం



ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్, కార్పొరేటర్ రచనశ్రీ, తదితరులు

కవాడిగూడ: మన సంస్కృతి, సాంప్రదాయాలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు ఎంతగానో దోహదపడతాయని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. మహిళలు, యువతులు, చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ ముగ్గుల పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు.

- కవాడిగూడ డివిజన్ మహిళామోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం కవాడిగూడ డివిజన్ గగన్‌మహల్ కూచిపూడి గ్రౌండ్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, న్యాయనిర్ణేతలతో కలిసి ముగ్గులను పరిశీలించారు. అనంతరం విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు.
- పోటీల్లో పాల్గొన్న 60మంది మహిళలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, పరిమళ్‌కుమార్, సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, రమేష్‌రాం, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు మహేందర్‌బాబు, ప్రభాకర్‌గంగపుత్ర, కేశవరాజు, సలంద్రి, రమేష్‌యాదవ్, కె. ఆంజనేయులు, కుమార్‌గౌడ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు హైమావతి, ప్రధాన కార్యదర్శి మంజుల, పుష్ప, మల్లేశ్వరి, శ్రీనివాస్, దిలీప్‌యాదవ్, శివరాజ్, రమేష్‌గౌడ్, హరీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొ. రాజేశ్వరరావుకు అడిషనల్ డీఎంఈగా పదోన్నతి



గాంధీఆస్పత్రి: గాంధీ ఆస్పత్రి మైక్రోబయోలజీ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ రాజేశ్వరరావుకు అడిషనల్ డీఎంఈగా పదోన్నతి కల్పించి ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం జరిగిన అభినందన సమావేశంలో ప్రొఫెసర్ రాజేశ్వరరావుకు పుష్ప గుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. వైద్యుల సంఘం (టీజీజీడీఏ) గాంధీ యూనిట్ అధ్యక్షునిగా, గాంధీ ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ కమిటీ ప్రతినిధిగా విధులు నిర్వహిస్తున్న రాజేశ్వరరావు సేవలను గుర్తించిన ప్రభుత్వం అడిషనల్ డీఎంఈగా పదోన్నతి కల్పించి నూతనంగా ఏర్పాటైన ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ.. ఖమ్మం మెడికల్ కాలేజీలో వైద్యవిద్యకు అవసరమైన అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు.

ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడిగా రాజశేఖర్‌రెడ్డి

అంబర్‌పేట: గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడిగా జె.రాజశేఖర్ రెడ్డి ఎన్నికయ్యారు. శుక్రవారం అంబర్‌పేటలో జరిగిన సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, కోశాధికారిగా శోభారెడ్డిని ఎన్నుకోవడం జరిగింది. త్వరలోనే నూతన కార్యవర్గాన్ని త్వరలో ఖరారు చేస్తామని అధ్యక్షుడు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. కరస్పాండెంట్లు మదుసూదన్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు, భాస్కర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, మోహన్‌సింగ్, చంద్రమోహన్, మహేష్, కృష్ణ తదితరులున్నారు.

డైరీ ఆవిష్కరణ



ముషీరాబాద్: గ్రేటర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ రూపొందించిన 2023 నూతన సంవత్సర డైరీని తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నర్సయ్య రాంనగర్‌లోని కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. సుధాకర్, జైపాల్‌రెడ్డి, గోపీనాథ్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

సంగీత విధ్వాంసులకు సన్మానం



నల్లకుంట: త్యాగరాజస్వామి ఆరాధన ఉత్సవాల సందర్భంగా పలువురు సంగీత విధ్వాంసులను సన్మానించారు. ఈ సందర్భంగా సంగీత అభిమాని ట్యాక్స్ కన్సల్టెంట్ గిరిధర్ శ్రీ సరస్వతి సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్, పంచశత వీణాగాన రత్న పోపూరి శ్రీనివాస శర్మను శాలువాతో సన్మానించారు. ప్రముఖ న్యాయవాది వీవీఎల్ఎన్ శర్మ, టీవీ దర్శక నిర్మాత శోభాశంకర్, ప్రముఖ వీణా విద్వాంసురాలు మల్లాది శాంతాకుమారి, పోపూరి రామమోహన్‌రావు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీనివాస కల్యాణం



చిక్కడపల్లి: వాసవి మహిళా సంఘం చిక్కడపల్లి ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. వేంకటేశ్వర మహామంత్ర పీఠం తిరుమల శ్రీవారికి సంకల్పించిన 111 కల్యాణాలలో భాగంగా 34వ శ్రీనివాస కల్యాణం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సంఘ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు శ్రీరాం విజయలక్ష్మి, మాలతి కార్యక్రమాలను పర్యవేక్షించగా.. ఈ కల్యాణంలో 108 జంటలు పాల్గొన్నాయి. సంఘం కోశాధికారి వసంత, వ్యవస్థాపక అధ్యక్షురాలు వరలక్ష్మి పాల్గొన్నారు.

లింబాద్రికి లింగ్విస్టిక్స్ ప్రొఫెసర్ల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ఉన్నత విద్యమండలి చైర్మన్ ప్రొ.లింబాద్రిని రిఫ్రెషర్స్ కోర్సుకు హాజరు కావాలని ఓయూ లింగ్విస్టిక్స్ ప్రొఫెసర్లు శుక్రవారం ఆహ్వానించారు. అనంతరం చైర్మన్ ప్రొ.లింబాద్రి చేతుల మీదుగా సావనీర్‌ను ఆవిష్కరించారు. లాంగ్వేజెస్ (భాష కోర్సులు), లింగ్విస్టిక్స్ కోర్సుల అధ్యాపకులకు రీఫ్రెషర్స్ కోర్సు (ఆర్‌సీ)ను నిర్వహించనున్నట్లు విభాగం హెడ్ ప్రొ.ఎండీ అన్సారీ, బీవోఎస్ ప్రొ.డాక్టర్ స్వాతి తెలిపారు.

జీవో 72తో 346 జూనియర్ కళాశాలలకు లబ్ధి



మాట్లాడుతున్న అధ్యక్షులు గౌరీ సతీష్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాష్ట్రంలోని ప్రైవేటు జూనియర్ కళాశాలలకు 'మిక్స్‌డ్ ఆక్యూపెన్సీ'కి సంబంధించి ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 72 కారణంగా 346 జూనియర్ కళాశాలలకు లబ్ధి చేకూరిందని 'తెలంగాణ ప్రైవేటు జూనియర్ కాలేజ్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్' (టీపీజేఎంఏ) రాష్ట్ర అధ్యక్షులు గౌరీ సతీష్ అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో టీపీజేఎంఏ రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవో నెంబర్ 72 రావడానికి విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్సీ పల్లారాజేశ్వర్‌రెడ్డిలతో పాటు సహకరించిన ఐఏఎస్ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

- జీవో నెంబర్ 112 ప్రకారం ఏటా 10 శాతం ట్యూషన్ ఫీజును ప్రభుత్వం పెంచాల్సి ఉండగా.. 2014 నుంచి ఫీజును పెంచలేదని సీఎం కేసీఆర్ స్పందించి వెంటనే ట్యూషన్ ఫీజును పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేటు జూనియర్ విద్యాసంస్థల అనుబంధ గుర్తింపును 1, 3, 5 ఏళ్లకు జారీ చేయాలన్నారు.
- ఒకే భవనంలో జూనియర్ కాలేజీ, వాణిజ్య సముదాయాలు ఉంటే కళాశాలలకు మిక్స్‌డ్ ఆక్యూపెన్సీ పేరిట అనుమతులు ఇవ్వడంలేదని ఈ నిబంధనను శాశ్వతంగా తొలగించాలన్నారు.
- ఫీజు రియంబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టీపీజేఎంఏ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డా. శ్రవణ్‌కుమార్, వరదారెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, అధికార ప్రతినిధి శ్రీనివాస్, కోర్ కమిటీ సభ్యులు బాలకృష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధీర్‌రెడ్డి, రాష్ట్రనాయకులు పార్థసారధి, రాజవర్ధన్, అమర్ తదితరులున్నారు.

ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాష్ట్రంలో ఉద్యమకారుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి అన్నారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమికను పోషించిన ఉద్యమకారుల విషయంలో ప్రభుత్వం ఎప్పటికీ అనుకూలంగానే ఉంటుందని చెప్పారు. ఉద్యమకారుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి వెళ్లలేదని తాను ఆ దిశగా కృషిచేస్తానన్నారు.

నూతన కమిటీ..

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం నూతన కమిటీని ఎన్నుకోగా.. అధ్యక్షుడిగా రూబీ స్టీవెన్‌సన్, ప్రధాన కార్యదర్శిగా తెలంగాణ వెంకన్న, కోశాధికారిగా రామచందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా శశిధర్ శిల్పి, బంగారుశ్రీను, సభ్యులుగా శివకుమార్, అశోక్ కుమార్, తెలంగాణ వికాస్ సమితి ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్ తదితరులున్నారు.

'ఎమ్మెల్యే రాజీనామా చేయాలి'



మాట్లాడుతున్న వినయ్‌కుమార్ తదితరులు

చిక్కడపల్లి: నియోజవర్గంలో అభివృద్ధి పట్టించుకోని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ రాజీనామా చేయాలని నగర బీజేవైఎం మాజీ అధ్యక్షుడు వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రత్నసాయి చంద్, మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్, సీనియర్ నాయకుడు వీఎస్టీ రాజు, పార్టీ ఓబీసీ విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నవీన్‌కుమార్, రాష్ట్ర మైనార్టీ మోర్చా (వక్ఫ్‌బోర్డు) కార్యదర్శి ఎండీ మహమూద్‌లతో కలిసి వినయ్‌కుమార్ మాట్లాడారు. ఎమ్మెల్యే రాజీనామాతో ఖాళీ ఏర్పడితే నియోజవర్గంలో ప్రభుత్వం మళ్లీ గెలవాలనే తాపత్రయంతో రూ. 5 నుంచి 6 వందల కోట్లు నియోజవర్గానికి కేటాయిస్తోందన్నారు.

- గాంధీనగర్ డివిజన్‌కు రూ. వంద కోట్లు మంజూరైతే మరిన్ని అభివృద్ధి పనులు చేస్తామన్నారు.
- నియోజవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయని ఎమ్మెల్యే గురువారం మాధవరావులేన్‌లో హడావిడిగా డ్రైనేజీ పైప్‌లైన్‌కు శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది ×సొమ్ముకడిది సోకొకడిదిలాగా॥ ఉందని డివిజన్ బీజేపీ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ కష్టపడి డ్రైనేజీ పైప్‌లైన్ మంజూరు చేయిస్తే ఆమెకు చెప్పకుండానే శంకుస్థాపన చేశారని విమర్శించారు.
- డివిజన్ నాయకులు, కార్యకర్తలు కష్టపడి కాలనీ వాసులను తీసుకుని వాటర్ బోర్డు ఎండీని కలిశామని పదిసార్లు కార్పొరేటర్‌తో కలసి వాటర్‌బోర్డు ఎండీ కార్యాలయం చుట్టూ తిరిగామన్నారు. ఎమ్మెల్యేను తాము ఎంతోగౌరవిస్తామని అయితే స్థానిక ఎంపీ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి డ్రైనేజీ శంకుస్థాపన వస్తే ఎమ్మెల్యేకు అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు.
- ఓ రోజు ముందే ఆఘమేఘాలమీద శంకుస్థాపన చేయాల్సిన అవసరం ఎమ్మెల్యేకు ఎందుకు వచ్చిందన్నారు. ఆయన కుటుంబసభ్యులే రెండుసార్లు ఈ డివిజన్ కార్పొరేటర్‌గా పనిచేసినా ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ఇప్పటికైనా ఇలాంటి అసంబద్ధ చర్యలకు స్వస్తి పలకాలని వినయ్‌కుమార్ ఈ సందర్భగా ఎమ్మెల్యేను డిమాండ్ చేశారు.

న్యూబోయిన్‌పల్లి క్రీడా మైదానంలో వాలీబాల్ మ్యాచ్

రసూల్‌పురా: ఈ నెల 15న ఆర్మీ డేను పురస్కరించుకుని ఇండియన్ ఆర్మీ ఔట్రీచ్ కార్యక్రమంలో భాగంగా న్యూబోయిన్‌పల్లి క్రీడా మైదానంలో కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ సహకారంతో శుక్రవారం వాలీబాల్ మ్యాచ్ జరిగింది. ఇండియన్ ఆర్మీ టీమ్, కార్ప్స్ ఆఫ్ ఈఎంఈ టీమ్ హైదరాబాద్ జిల్లా జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమానికి మిలిటరీ కాలేజ్ అధికారి మహాబత్రా, స్పోర్ట్స్ ఆఫీసర్ కేప్టెన్ అతుల్ యాదవ్, ఎస్ఎం సెంటర్ అధికారి చంద్రబాన్ తివారి, స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ జంపన ప్రతాప్, పోటీల స్పాన్సర్ సామల రాఘవరెడ్డి హాజరయ్యారు. ఈ పోటీల్లో ఇండియన్ ఆర్మీ జట్టు, కార్ప్స్ ఆఫ్ ఈఎంఈ జట్టుపై విజయం సాధించి ట్రోఫీ కైవసం చేసుకుంది. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ వెటరన్ అథ్లెట్ మర్రి లక్ష్మారెడ్డి, స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్, ప్రభుకుమార్ గౌడ్, రఘు చరణ్, నందకిషోర్, ప్రకాష్ పాల్గొన్నారు.

'మాజీ సైనికులకు ప్రభుత్వం ఇంటి స్థలం కేటాయిస్తుంది'

సుల్తాన్‌బజార్: దేశానికి సేవలు అందించి పదవీ విరమణ పొందిన మాజీ సైనికులకు ఇంటి స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకుందని రాష్ట్ర మాజీ సైనికుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అమ్మిక రంగయ్యగౌడ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం హిమాయత్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ.. మాజీ సైనికుల కుటుంబాలకు 250 గజాల స్థలం కేటాయించాలని కోరుతూ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్, మండల రెవిన్యూ అధికారులకు లేఖ రాశామని, ప్రభుత్వం స్పందించి జవహర్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని సర్వే చేసి నివేదిక అందజేయాలని కీసర ఆర్డీఓ, కాప్రా తహసీల్దార్‌కు కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఇంటి స్థలం కోసం రిజిస్టర్ చేసుకున్న జంట నగరాల్లో ఉన్న మాజీ సైనికులు అల్వాల్‌లో ఉన్న తమ సంఘం కార్యాలయానికి వచ్చి పేర్లు పరిశీలించుకోవాలని సూచించారు. కొత్తగా రిటైర్డ్ అయిన సైనికులు తమ పేర్లను రిజిస్టర్ చేసుకునే అవకాశం ఉందన్నారు. పూర్తి సమాచారం కోసం 9346227672 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

జిమ్‌లో మైనర్ రహస్య ఫొటోలు తీసిన అన్నదమ్ములు

ఇద్దరి అరెస్టు

రసూల్‌పురా: ఫిట్నెస్ సెంటర్‌లో జిమ్ చేస్తున్న ఓ మైనర్ బాలిక ఫొటోలు తీసి మార్ఫింగ్ చేసి వేధింపులకు పాల్పడుతున్న నిర్వాహకులపై బోయిన్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రవికుమార్ వివరాల ప్రకారం.. సెంటర్ పాయింట్ వద్ద ఫిట్‌నెస్ ఆర్ జోన్‌లో స్థానికంగా ఉన్న ఓ మైనర్ బాలిక జిమ్ చేస్తుండగా శిక్షణ ఇస్తున్న సమయంలో సన్నిహితంగా ఉన్న ఫొటోలను మార్ఫిగ్ చేసి బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్న నిర్వాహకులు రవియాదవ్, రాజుయాదవ్ సోదరులపై బాలిక కుటుంబ సభ్యులు, భవన యజమాని సాద కేశవ రెడ్డి ఫిర్యాదు చేయడంతో ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ జరిపి వారిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాలికను బ్లాక్ మెయిలింగ్ చేసి 20 తులాల బంగారు, 60 తులాల వెండి ఆభరాణాలు, రూ. 4.50 లక్షలు తీసుకున్నారన్నారు. బాలిక జిమ్ చేస్తున్న సమయంలో ఆమె శరీర భాగాలను తాకుతూ ఉన్న ఫొటోలను రహస్యంగా తీసి బాలికను బెదిరింపులకు గురి చేసినట్లుగా తెలిపారు. ఇంతకు ముందు మరో నలుగురు యువతులను కూడా ఇదే విధంగా ఫొటోలు మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిల్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.